క్లుప్తంగా

హెచ్. కైరవాడిలో డెంగీ కేసు నమోదు

గోనెగండ్ల : మండల పరిధిలోని హెచ్. కైరవాడి గ్రామంలో 6 ఏళ్ల బాలుడికి డెంగీ నిర్ధారణ అయినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. సోమవారం వైద్య సిబ్బంది హెచ్. కైరవాడి గ్రామానికి వెళ్లి నివారణ చర్యలు చేపట్టారు. డెంగీ కేసు నమోదైన బాలుడి ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగు నీరు,నిల్వ ఉన్న నీటిని తొలగించి దోమల మందును పిచికారీ చేయించారు. గ్రామస్తులకు డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించారు. అలాగే మురికి కాలువలు, ఇంటి పరిసరాల ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాల ని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పరమేష్, ఎంపీహెచ్‌ఓ హనుమంతు, ఏఎన్‌ఎంలు,ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గురువు కుటుంబానికి అండగా శిష్యులు



బడేసాహెబ్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న శిష్యులు

గోనెగండ్ల : మండల పరిధిలోని అలువాల గ్రామంలో టీచర్ బడేసాహెబ్ కుటుంబానికి ఆయన శిష్యులు సోమవారం ఆర్థికసాయం అందజేసి గురుభక్తిని చాటుకున్నారు. అలువాల గ్రామానికి చెందిన బడేసాహెబ్ గ్రామంలో ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తూ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. బడేసాహెబ్ దగ్గర చదువుకున్న విద్యార్థులందరూ కలిసి నగదు సేకరించి ఆయన స్వగృహంలో రూ.1లక్ష నగదును ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. పాఠాలు నేర్పిన గురువు మరణం జీర్ణించుకోలేనిదని, గురువు కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బాషా, శ్రీనివాసులు, ఖాసీం వలి, ప్రతాప్, బాషా, లక్ష్మన్న, వెంకటేష్, గిడ్డయ్య, ఈరన్న, కోటేష్ చిన్న బడేసా తదితరులు పాల్గొన్నారు.

టిడ్కోలో సౌకర్యాలు కల్పిస్తాం



టిడ్కో గృహాల వద్ద పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ

ఆదోనిటౌన్: పట్టణ శివారులోని టిడ్కోలో లబ్ధిదారులు గృహ ప్రవేశం చేసేలా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. సోమవారం టిడ్కో ప్రాంతంలో జేసీబీతో ముళ్లకంపల తొలగింపు పనులు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. టిడ్కో గృహాలకు మంచినీరు, విద్యుత్ సరఫరాను అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి లబ్ధిదారుడు గృహ ప్రవేశం చేసేలా చూడాలని సూచించారు.

రూ. 2.5కోట్లతో అభివృద్ధి పనులు



సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : మండలంలో రూ. 2.5కోట్లుతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని కంబలదిన్ని గ్రామంలో రూ. 20 లక్షలతో, జాలవాడి గ్రామంలో రూ. 10లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనాథ్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జయరాముడు, పీఆర్ ఏఈ ఖాదర్‌బాషా, ఏపీఓ ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

టీబీపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాహెన్‌రాజ్

ఆదోని టౌన్: టీబీ (క్షయ) పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సాహెన్‌రాజ్, వైద్యసిబ్బంది సూచించారు. సోమవారం పట్టణంలోని హవన్నపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రజలకు టీబీపై అవగాహన కల్పించారు. మొండి టీబీ కేసులను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. టీబీ రోగులు మంచి పౌష్టికాహారం తీసుకుని, వైద్యుల సలహాలు పాటిస్తే జబ్బు నయమవుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాబురాజు, జ్ఞానేశ్వరిదేవి, రేఖ, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలొచ్చే.. నారు కష్టాలు తీర్చే

- పంటల సాగులో పెను మార్పులు
- విస్తరిస్తున్న నర్సరీలు
- నారు స్థానంలో మొక్కల కొనుగోలు
- రైతన్నకు తగ్గుతున్న ప్రయాస
- కలిసొస్తున్న సమయం



ఎమ్మిగనూరు వద్ద ఓ నర్సరీలో పెరుగుతున్న మొక్కలు

ఎమ్మిగనూరు: పంటల సాగులో మార్పులొస్తున్నాయి. సాంకేతిక పుణ్యం..యాంత్రిక నైపుణ్యం మూలంగా వ్యవసాయంలో పెనుమార్పులొచ్చాయి. మోటు వ్యవసాయం కాస్త స్మార్ట్ వ్యవసాయంగా మారుతోంది. ఇంటి దగ్గర నుంచే విద్యుత్ మోటారులు ఆన్ చేయొచ్చు. ఇంటి నుంచే వ్యవసాయ పనులను పర్యవేక్షించొచ్చు. ఈ కోవలేనే నారుపోయి వాటి స్థానంలో నర్సరీలు పుట్టుకొచ్చాయి. అవసరం మేరకు పంటనారును సరఫరా చేసే నర్సరీలతో రైతులకు బహుముఖ ప్రయోజనాలు దక్కుతున్నాయి.

కూరగాయలు, వాణిజ్య పంటలపై పెరిగిన మక్కువ

ఆదోని, పత్తికొండ డివిజన్‌లలో రైతులు టమాట, మిరప పంటల సాగు విస్తృతంగా చేపడతారు. ఒకప్పుడు టమాట, మిరప పంటలతో పాటు కూరగాయల పంట సాగు కావాలంటే రైతులు ఎంతో శ్రమించాల్సి వచ్చేది. పంటసాగు చేయాలంటే ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలి. రైతులు పొలాల్లోనే వారికి కావాల్సిన నారు కోసం విత్తనం చల్లి మొక్కలయ్యాక పొలంలో నాటుకునేవారు. ఈ ఏర్పాట్లు జరిగేందుకు నెలరోజులు పట్టేది. కొంత మందికి నీటి కొరత, మరి కొంత మందికి విద్యుత్ సమస్య ఉండేది. నారు పెంచేందుకు ఎంతో వ్యయప్రయాసాలకోర్చాల్సి వచ్చేది. అయితే రైతుల్లో కూరగాయాలు, వాణిజ్య పంటలసాగుపై మక్కువ పెరగటం, మంచి ధరలు మార్కెట్లో లభిస్తుండటంతో పంటసాగు విస్తీర్ణం ఏటేటా పెరుగుతూ వస్తోంది. అదేవిధంగా పంట కోత సమయం కూడా తగ్గాలనే ఉద్దేశంతో నర్సరీలను ఆశ్రయిస్తుండటంతో నియోజకవర్గ కేంద్రాల్లో, మండల కేంద్రాల సమీపంలో నర్సరీలు అనేకం పుట్టుకొస్తూనే ఉన్నాయి.

ఆదోని డివిజన్‌లో 70కుపైగా నర్సరీలు

పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో టమాట పంటను రైతులు విస్తారంగా సాగుచేస్తారు. అదేవిధంగా ఎమ్మిగనూరు, ఆదోని సబ్ డివిజన్‌లలో మిరప సాగు పట్ల రైతులు ఆశక్తి పెంచుకోవడంతో ఇక్కడ మిరపలో వివిధ రకాల వంగడాలను సాగు చేస్తున్నారు. దీంతో నర్సరీలు విస్తరించాయి. ఉమ్మడి ఆదోని డివిజన్‌లో సుమారు 70కుపైగా నర్సరీలు ఉన్నాయి. ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లో ఎమ్మిగనూరు, గాజులదిన్నె, హెచ్ మురవణి, కపటి, కోసిగి ప్రాంతాల్లో నర్సరీల్లో మిరపకు అధిక డిమాండ్ ఉంది.

పంటసాగులో మార్పులు

పదహారేళ్ల క్రితం నర్సరీల ఊసే ఉండేది కాదు. రైతులే తమ పంట పొలంలో కొంత భాగంలో మిరప నారు చల్లి నెలరోజుల పాటు పెంచే వారు. అటు తరువాత వాటిని పొలం మొత్తంలో బోదెల్లో మొక్కలుగా నాటేవారు. పలువురు రైతులు కలిసి ఒకరైతు పొలంలోనే మిరపనారు పెంచి తరువాత తమ పంటపొలంలో నాటుకునేవారు. కానీ నేడు టమాట, మిరప పంటలతోపాటు వివిధ రకాల కూరగాయాల పంటల నారు, పూల మొక్కల నారును నర్సరీల్లో పెంచుతూ రైతులకు అవసరమైన మేరకు విక్రయిస్తున్నారు. రైతుల అవసరాన్ని, మొక్క రకాన్ని బట్టి ధరలు నిర్ణయిస్తూ నర్సరీ యజమానులు వ్యాపారంలో లాభాలు గడిస్తున్నారు.

సమయం కలిసొస్తుంది



వాతావరణ పరిస్థితులు ఎప్పుడు ఎలా ఉంటాయో అంచనా వేయటం కష్టమవుతోంది. అందువల్ల ముందస్తుగా పొలంలో నారు పోసుకుంటే అవి మొక్కలయ్యే సరికి వర్షాలు వస్తాయో, రావో ? తెలియదు. వర్షాలు రావడం ఆలస్యమైతే నారు ముదిరిపోతుంది. అందువల్ల నర్సరీల్లో అయితే మనకు ఎప్పుడు అవసరమో అప్పుడే నారు కొనుగోలు చేసి పంటసాగు చేయొచ్చు. దీనివల్ల పెట్టుబడి వ్యయం పెరిగినా సమయం కలిసొస్తుంది. అదనులో పంటసాగు జరుగుతోంది.

– షకూర్, మిర్చి రైతు, ముగతిగ్రామం

మార్కెట్ ధరలను బట్టి వ్యాపారం



నర్సరీలో మొక్కల విక్రయాలు కూడా ఎప్పుడూ ఒకేలా ఉండవు. మిర్చి, టమాట ధరలు మార్కెట్లో బాగుంటే రైతులు ఎక్కువ ధరకైనా నారు కొంటారు. అదే మార్కెట్లో ధరలు పడిపోతే పంటసాగు చేసేవారి సంఖ్య తగ్గిపోయి మేముకూ డా నష్టపోవాల్సి వస్తుంది. మిరప ,టమాటా, వంకాయ నారు అందుబాటులో ఉంచుతున్నాం. వాతావరణం, మార్కెట్ ధరలపైనే నర్సరీల భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.

– పి రమణ, నర్సరీ యజమాని (గాజులదిన్నెక్రాస్)

బొమ్మాట పేరుతో మోసం

మంత్రాలయం : మండల పరిధిలోని సూగూరు గ్రామంలో జాతర సందర్భంగా బొమ్మాట పేరుతో మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని మంత్రాలయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంత్రాలయం ఎస్‌ఐ పరమేష్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం నందవరం మండల కేంద్రానికి చెందిన ప్రేమ్‌దాస్ అనే వ్యక్తి బొమ్మాట పేరుతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందవచ్చని ప్రజలను మోసం చేస్తున్నట్లు ఫిర్యాదు వచ్చిందన్నారు. దీంతో ప్రేమ్‌దాస్‌ను అదుపులోకి తీసుకుని కొంత మేర నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఇసుక రీచ్‌లపై నేడు అవగాహన సదస్సు

కౌతాళం: మండలంలోని గుడికంబాలి, మరళి, నదిచాగి గ్రామాల్లో ఇసుక రీచ్‌లపై గ్రామస్తులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు మల్లికార్జునస్వామి తెలిపారు. గ్రామ సభలు నిర్వహించి ఆయా గ్రామాల ప్రజల నుంచి సూచనలు, సలహాలు తీసుకుంటామన్నారు.

బకాయిలను వెంటనే చెల్లించాలి

ఆదోని సెంట్రల్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ ఆదోని పట్టణ శాఖ అధ్యక్షులు రవి డిమాండ్ చేశారు. సోమవారం ఎస్టీయూ ముఖ్య నాయకుల సమావేశం నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో జరిగింది. వారు మాట్లాడుతూ పీఎఫ్, ఏపీజీఎల్ఐ తో పాటు సంపాదిత సెలవులకు నగదు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమములో ఎస్టీయూ నాయకులు ప్రహ్లాద్, సుధాకర్, ఖలీల్, జుబీర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లక్కీడిప్‌లో మద్యం షాపుల కేటాయింపు

ఎమ్మిగనూరురూరల్: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఎమ్మిగనూరు టౌన్, రూరల్, నందవరం, మాధవరం ప్రాంతాల్లో ఉన్న 15 మద్యం దుకాణాలకు పోటాపోటీగా 296 మంది ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లో దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం కర్నూలులో ఉత్కంఠగా సాగిన లక్కీ డిప్‌లో 296 మందిలో 15 మందికి లక్కు దక్కింది.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని షాప్ నెం.46ను ఈ.ధరిగౌడ్, షాప్ నెం.47న కె. చంద్రశేఖర్, షాప్ నెం.48ను బి. నాగరాజు, షాప్ నెం.49ను బోయ సుభాన్, షాప్ నెం. 50ను రెడ్డిసత్యనారాయణరెడ్డి, షాప్ నెం.51ను కోటేకల్ రవితేజరాజు, షాప్ నెం .52ను కడిమెట్ల విరుపాక్షిరెడ్డి, షాప్ నెం. 53ను జి. నిఖిల్‌కుమార్‌గౌడ్ దక్కించుకున్నారు.

రూరల్: మండలంలో షాప్ నెంబర్ 54ను ఉప్పర హంపయ్య,షాప్ నెం.55ను బోయ కోటేకల్ జగదీష్, షాప్ నెం.56ను కల్లుకుంట వెంకటేశ్వరరెడ్డిలు దక్కించుకున్నారు.

మంత్రాలయం: మంత్రాలయం మండలంలో షాప్ నెం. 57 , షాప్‌నంబర్ 58ను కుమ్మరి విజయ్‌కుమార్ రెండు షాప్‌లు దక్కించుకున్నాడు.

నందవరం: మండలంలో షాప్ నెం. 59ను మాచాని వెంకటేశ్వర్లు, షాప్‌నెంబర్ 60ను ఈడిగ నరసింహుడులు దక్కించుకున్నారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని పత్తికొండ ఎక్సైజ్‌సర్కిల్ పరిధిలోని గోనెగండ్ల మండలంలో మూడు మద్యం దుకాణాలు మంజూరు కాగా వాటిలో షాప్‌నెం. 96ను తలారి అనిత, షాప్ నెం. 97ను బి. నిత్యానందరెడ్డి, షాప్ నెం. 98ను తలారి అంబమ్మలకు దక్కాయి.

ప్రభుత్వ వైద్య కళాశాల పనులు చేపట్టాలి



ఎమ్మెల్యే డా.పార్థసారథికి వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి యువజన సంఘాల నాయకులు

ఆదోని సెంట్రల్: ఆదోనిలో నిలిచిపోయిన ప్రభుత్వ వైద్య కళాశాల పనులను చేపట్టేందుకు చొరువ చూపాలని విద్యార్థి యువజన సంఘాల జేఏసీ నాయకులు శ్రీనివాసులు, సోమశేఖర్, తిరుమలేష్ కోరారు. సోమవారం విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే డా.పార్థసారథికి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ శరీవేగంగా సాగుతున్న పనులను అర్ధంతరంగా నిలిపివేయడం దారుణమన్నారు. దీంతో ఈ ఏడాది ప్రారంభం కావాల్సిన వైద్య కళాశాల అడ్మిషన్లు నిలచి పోయాయని తెలిపారు. పనులు పూర్తి అయితే పశ్చిమ ప్రాంత ప్రజలు మెరుగైన వైద్యంతో పాటు పేద మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి యువజన జేఏసీ నాయకులు ఉదయ్, రమేష్, శశి, నరేష్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

దేవాలయ భూములను సంరక్షించాలి

ఆదోని రూరల్: అన్యాక్రాంతానికి గురైన దేవాలయ భూములను సంరక్షించాలని బీజేపీ అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజుగౌడ్ ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌ను కోరారు. మండలంలోని వెంగలాపురం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 24, 25 చాకీమఠంకు, బైరాగీమఠంకు సంబంధించిన దేవాలయ భూములు అన్యాక్రాంతానికి గురైనట్లు, వాటిని సంరక్షించాలని సోమవారం సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో న్యాయవాది, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు లోకేష్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మహాదేవ్ తదితరులు పాల్గొన్నారు.

భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: డివిజన్‌లోని మాధవరం గ్రామ సర్వేనంబర్ 148ఏలో 18.20 ఎకరాల రాంపురం గ్రామానికి చెందిన సులేమాన్‌షేక్ సుకూర్ షేక్ రజాక్‌లకు చెందిన వారసత్వ భూమిని కొందరు ఆక్రమించుకున్నారని, వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు కోరారు. సోమవారం సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు ఆదోనిలోని కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి లక్ష్మణనాయక్, నాయకులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళి

ఎమ్మిగనూరుటౌన్: ప్రజా ఉద్యమ కారుడు, అంతర్జాతీయ హక్కుల ఉద్యమకారుడు ప్రొఫెసర్ సాయిబాబా బడుగు వర్గాలకు అందించిన సేవలు చిరస్మరణీయమని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, పౌరహక్కుల సంఘం నాయకుడు వెంకటేష్, సీపీఎం నాయకుడు గోవిందు అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతి ప్రజా ఉద్యమానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో నాయకులు పంపణ్ణగౌడ్, రాముడు, మదార్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

కలుగొట్ల రోడ్డును నిర్మించండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో శిథిలమైన కలుగొట్ల రోడ్డును పునర్నించాలని పీపుల్స్ యాక్షన్ ఫోరం ఇండియా రాష్ట్ర కన్వీనర్ దిలీప్‌కుమార్ కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందించారు.

16 మందికి ఉద్యోగావకాశాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం క్యాంపస్ నియామకాలు జరిగాయి. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డా. వీ. వీరన్న మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన కే1-టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ బీటెక్, ఎంబీఏ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా కాలేజీకి చెందిన 16 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరికి సంవత్సరానికి ఒక్కొక్కరికి రూ. 5.2 లక్షలు ప్యాకెజీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.సుధాకర్, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ డీన్ డా.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీని నిర్వీర్యం చేసేందుకు కుట్ర

ఎమ్మిగనూరుటౌన్: ఎల్‌ఐసీ సంస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్ర జరుగుతుందని ఇందులో భాగంగానే ఏజెంట్ల కమీషన్‌ను తగ్గించడం జరిగిందని ఎల్‌ఐసీ ఏజెంట్ల సంఘ అధ్యక్ష,కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, జయ, వీరేష్, జోనల్ నాయకుడు ఆంధ్రయ్య ఆరోపించారు. ఏజెంట్ల సమస్యలపై సోమవారం స్థానిక ఎల్‌ఐసీ బ్రాంచ్ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎల్‌ఐసీ ఏజెంట్ల సంఘ నాయకులు సోమన్న, సోలమాన్, సత్యరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలి

ఆదోని సెంట్రల్: ఎల్‌ఐసీ ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలని ఆలిండియా లియాఫీ బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు సిద్ధలింగ, రఫిక్ తెలిపారు. సోమవారం భోజనం విరామమం సమయంలో ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట ధర్నాను చేపట్టారు. ధర్నాకు ఎంప్లాయిస్ యూనియన్ మద్దుతు తెలపడం సంతోషదాయకమన్నారు. ఆలిండియా పిలుపు మేరకు ఈ నెల 21, 28వ తేదీలో కూడా ధర్నాలను నిర్వహిస్తామని, పాలసీదారులు సహకరించాలని కోరారు.

17న పేట ఆలయంలో పూజలు

ఆదోని అర్బన్: పట్టణంలోని శ్రీ పేట వీరభద్రస్వామి దేవాలయంలో ఈనెల 17న మహారుద్ర హోమం, శ్రీ మహాప్రత్యంగిరా హోమం (లోకకళ్యాణార్థం) పూజలు నిర్వహిస్తున్నట్లు ఆదోని డివిజన్ జంగమఅర్చక సమాఖ్య సభ్యుడు మహర్షి విజయ్‌కుమార్ సోమవారం తెలిపారు. తెల్లవారుజామున 4.30 గంటల నుంచి పూజలు ప్రారంభమవుతాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సబ్‌కలెక్టర్‌ను కలిసిన తహసీల్దార్



సబ్‌కలెక్టర్‌కు పూల మొక్క అందజేస్తున్న హొళగుంద తహసీల్దార్ సతీష్‌కుమార్

ఆదోని రూరల్: ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను సోమవారం హొళగుంద నూతన తహసీల్దార్ సతీష్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్క అందజేశారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో రెవెన్యూపరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

సిజేరియన్ పేరుతో ఆర్థిక దోపిడీ

ఎమ్మిగనూరుటౌన్:సిజేరియన్ పేరుతో ప్రసవాలు చేస్తూ పట్టణంలోని పలు నర్సింగ్ హోంలలో ఆర్థిక దోపిడీ చేస్తున్నారని ఏపీ మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్ష,కార్యదర్శులు వాణమ్మ, ఈరమ్మ ఆరోపించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని పలు నర్సింగ్ హోంలలో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యతనివ్వక, సిజేరియన్‌లకే ఆసక్తి చూపుతూ ధనార్జనే ధ్యేయంగా నిలువుదోపిడి చేస్తున్నారని అన్నారు. ఆయా నర్సింగ్ హోమ్‌లపై సత్వరం చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

గ్రామాల్లో 'పల్లె పండగ'



బైచిగేరిలో మురుగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఆదోని రూరల్: మండలంలోని బైచిగేరి గ్రామంలో 'పల్లె పండగ వారోత్సవాలు' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే డా.పార్థసారధి గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. అంతకముందు గ్రా మంలో వీధి వీధిన తిరిగి ప్రతి ఇంటి వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తమదృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మహాదేవ, ఏపీడీ లోకేష్, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

నందవరం : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని హాలహర్వి గ్రామంలో ఎమ్మెల్యే జయ నాగేశ్వరరెడ్డి పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ముందుగా గ్రామంలోని నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని గ్రామ సర్పంచ్ మునేమ్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే జగ్గాపురం గ్రామంలో పర్యటించి బీసీ కాలనీలో రూ.10 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం గ్రామంలో రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ పుల్లయ్య, పీఆర్‌ఈఈ వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి, ఏనుగుబాల గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్లెపండుగ కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. ఎంపీడీవో బంగారమ్మ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్లకు భూమి పూజ

కౌతాళం: ప్రభుత్వ కార్యక్రమం పల్లెపండుగలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని ఎస్టీ ఆర్ నగర్‌లో సిమెంటు రోడ్డు నిర్మాణానికి రూ.10లక్షలతో అలాగే శివప్పనగర్‌లో రూ.15లక్షలతో సిమెంటు రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ చేపట్టినట్లు ఎంపీడీఓ సుబ్బారాజు, తహసీల్దారు మల్లికార్జునస్వామిలు తెలిపారు.

గోవిందమ్మకు అండగా ఉండాలి

పెద్దకడబూరు : గోవిందమ్మకు ప్రభుత్వం తక్షణ రక్షణ, దీర్ఘకాలిక భద్రత, చట్టపరమైన మద్దతు, ఆర్థిక సాయం, మానసిక మద్దతుతో అండగా ఉండాలని దళిత సంఘాల నాయకులు బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి మంచాల లక్ష్మీనారాయణ, బీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రామతీర్థం అమరేష్, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకులు కదిరికోట బతుకమ్మ తదితరులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో ఎస్సీ కులానికి చెందిన గోవిందమ్మపై జరిగిన అమానవీయ దాడికి నిరసనగా దళిత సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఎస్సీ కాలనీ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు సోమవారం నిరసన ర్యాలీతో సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ పోలీసులు తక్షణమే అసలైన నిందితులను ఎఫ్ఐఆర్‌లో యాడ్ చేసి రిమాండ్‌కు పంపించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎమ్మిగనూరులోని సోమప్ప కూడలిలో గత 13రోజులుగా నిరహారదీక్ష చేపడుతున్న గోవిందమ్మ ఆరోగ్యానికి ఏమైనా జరగరానిది జరిగితే జిల్లా ఎస్పీ, కలెక్టర్‌లదే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అనంతరం వినతిపత్రాన్ని జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులతకు సమర్పించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు సుమాల చార్లెస్, మాల మహానాడు నాయకులు నరసన్న, ఉసేని, రాజోలప్ప, యువరాజు, ముక్కరన్న, అర్లప్ప, శాంతిరాజు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: పెదకడుబూరు మండలం కల్లుకుంట గ్రామంలో దాడికి గురిన గోవిందమ్మకు ప్రభుత్వం సత్వర న్యాయం చేయాలని ఏపీ ఎంఆర్‌పీఎస్ జి ల్లా అధికార ప్రతినిధి జయన్న, నాయకులు రంగన్న, మహిళా సమాఖ్య నాయకురాలు ఈరమ్మ డిమాండ్ చేశారు. స్థానిక సోమప్ప సర్కిల్‌లో 13వ రోజు దీక్ష చేపట్టిన గోవిందమ్మకు సోమవారం సంఘీభావం తెలిపారు. ఆయా సంఘాల నాయకులు నాగేష్, దేవరాజు,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నందవరం పీహెచ్‌సీలో విలీనం చేయాలి

నందవరం : పెద్దకొత్తిలి, గంగవరం, జోహరాపురం, చిన్నకొత్తిలి, సంజీవపురం గ్రామాలకు దగ్గరగా ఉన్న నందవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) నుంచే వైద్య సేవలు అందించాలని ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. సోమవారం ఆయా గ్రామాలకు చెందిన ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తమ గ్రామాలను నందవరం పీహెచ్‌సీలో విలీనం చేయాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఏఎన్‌ఎం పుష్పవతి, ఆశా వర్కర్ రామేశ్వరి, సీహెచ్‌ఓ బలరామ్ పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు బాలరాజు, ఏఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి సత్యన్న డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందించారు.

ఘనంగా గంధం వేడుకలు



గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

కౌతాళం: మండల కేంద్రంలో మహబుబ్ సుభాని ఉరుసులో భాగంగా సోమవారం రాత్రి గంధం వేడుకలు వైభవంగా జరిగాయి. దర్గా నుంచి రాత్రి 7 గంటలకు ప్రారంభం అయిన గంధం వేడుకలు రాత్రి 9గంటల వరకు గ్రామ పురవీధుల గుండా వైభవంగా జరిగాయి. మంగళవారం రోజు ఉరుసు ఉత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు



ఓ దుకాణంలో ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న కమిషనర్, సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వ్యాపారులు నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్ ప్రాంతంలోని పలు దుకాణాలపై మున్సిపల్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకొన్నారు. ప్లాస్టిక్ వినియోగించే వ్యాపారులకు రూ.10వేల జరిమానా విధించి హెచ్చరికలు జారీ చేశారు. పట్టణ ప్రజలు ప్లాస్టిక్ కవర్లను ఉపయోగించవద్దని వాటి ద్వారా పర్యావరణం దెబ్బతింటుందన్నారు. మున్సిపల్ డీఈ నీరజ, ఏఈ శరత్‌చంద్ర, మదన్‌కుమార్ పాల్గొన్నారు.

పారిశుధ్యపనుల్లో నిర్లక్ష్యం తగదు

పట్టణంలో పారిశుధ్య పనుల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహించడం తగదని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి హెచ్చరించారు. సోమవారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని వార్డు సచివాలయాల పరిధిలోని షాపులు, తోపుడు బండ్ల వ్యాపారుల వద్ద ప్లాస్టిక్ వినియోగం లేకుండా చూడాలన్నారు. మున్సిపల్ డీఈ రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

గోనెగండ్ల : వాతావరణ శాఖ తెలిపిన సమాచారం మేరకు ఈనెల 16వ తేదీ వరకు వర్ష సూచన ఉందని, రైతులు ముందు జాగ్రత్తలు తీసుకొని ప్రస్తుత పంటలను కాపాడుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వరి పంటకు వర్షం ఎక్కువైతే పొలాల్లో నీరు నిలబడకుండా బయటకి పంపాలన్నారు. వీలైనంత వరకు ఇప్పుడు పైపాటి ఎరువులు వేసుకోకూడదని, అవసరం అయితే వర్షం తగ్గిన తర్వాత వేసుకోవాలన్నారు. వేరుశనగ పంట కోతలు పూర్తి అయి ఉంటే వేరుశనగ కాయలు తడవకుండా టార్పాలిన్‌తో కప్పి ఉంచుకోవాలని సూచించారు. ఒక వేళ కోతకు సిద్ధంగా ఉంటే వర్షం తగ్గిన తర్వాత కోతలు చేసుకోవాలన్నారు. అలాగే పత్తి తీతలు చివరి దశలో ఉన్నాయి, కాబట్టి చివరి తీతను వాయిదా వేసుకోవాలని, లేదా త్వరగా చివరి తీత పూర్తి చేసుకొని పత్తి వర్షంలో తడవకుండా కాపాడుకోవాలన్నారు. పప్పు శనగ వీలైనంత వరకు వర్షాలు తగ్గిన తర్వాత విత్తుకుంటే మంచిదని అభిప్రాయపడ్డారు. అక్టోబర్ 15 తర్వాత విత్తుకుంటే మంచిదన్నారు. కంది ప్రస్తుతం మొగ్గ నుంచి పూత దశలో ఉంది, కాబట్టి వర్షాలు ఎక్కువై ఎక్కడైనా పొలాల్లో నీరు నిలబడితే పొలం గట్లను తెంచి నీటిని బయటికి పంపాలని సూచించారు. లేకపోతే వేరు కుళ్లు, ఎండు తెగులు ఆశించే అవకాశం ఉంటుందని తెలిపారు.